క్లుప్తంగా

జేఈఈలో 'నంద్యాల' విద్యార్థుల ప్రతిభ




ర్యాంకులు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జేఈఈ మెయిన్-2024 పరీక్షల్లో ది నంద్యాల జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించడం అభినందనీయమని ఆర్‌జీఎం విద్యాసంస్థల అధినేత మిద్దె శాంతిరాముడు, ప్రిన్సిపాల్ అకర్తహుసేన్ పేర్కొన్నారు. జేఈఈ మెయిన్ ఫలితాల్లో కె.దీక్షిత్‌కు 95.286, మిద్దె భైరేష్ 93.2 శాతం పర్సంటైల్ సాధించారని, అలాగే మరో 13మంది అద్భుతమైన ఫలితాలు సాధించారని చెప్పారు.

16న రథసప్తమి వేడుకలు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పాలియేరలో వెలసిన లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీన మాఘమాస శుద్ధ సప్తమి (రథసప్తమి) ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రవాణా రంగంలో డ్రైవర్లే కీలకం

నంద్యాల టౌన్: రవాణా రంగానికి డ్రైవర్లు వెన్నెముక లాంటి వారని ఆర్‌ఎం రజియా సుల్తానా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా రవాణాశాఖ అధికారి శివారెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడారు. అనంతరం గత ఏడాది ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. టూ టౌన్ ఎస్‌ఐ నవీన్, డిపో మేనేజర్ గంగాధర రావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నంద్యాల(అర్బన్): రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటైన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓ సాల్మాన్‌తో కలిసి ఎన్‌టీఆర్ షాదీఖానా, గాంధీనగర్, రైతునగర్, క్యాంపస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, పీపుల్స్ క్లబ్, లీడర్స్ మోడల్ స్కూల్, సంతగేటు స్కూల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని రైతునగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీగౌరీ కేదార్‌నాథ్ ఆలయంలో శివాలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా గౌరీ మాతకు, కేదారేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మహాకుంభాభిషేకం, కుంభ దృష్టి ప్రథమ అభిషేకం అనంతరం శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

సహకార గోడౌన్ ప్రారంభం

నంద్యాల(అర్బన్): కేడీసీసీ బ్యాంక్ సహకార గోడౌన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కానాల సహకార సొసైటీ అధ్యక్షుడు జగదీశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని చాబోలు గ్రామ రహదారిలో రూ.79 లక్షలతో ఏర్పాటు చేసిన కానాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ బహుళ ప్రయోజన సౌకర్య గోదామును బుధవారం కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ హుసేన్‌బాషా, సర్పంచ్ మౌనికతో కలిసి ప్రారంభించారు.

ప్రత్యేక ప్రార్థనలు

చాగలమర్రి: ఉపవాస దినాల ప్రారంభం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు బుధవారం ప్రారంభమయ్యాయి. పెద్ద బోధనం గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో రెవ.ఫాదర్ సంపత్ కుమార్ ఉపవాస దిన ఆవశ్యకతను వివరించారు.

మధ్యంతర భృతి చెల్లించాలి

నంద్యాల(అర్బన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని ఉద్యోగుల, ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ చైర్మన్ వెంగళరెడ్డి కోరారు. బుధవారం ఈ మేరకు అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలోజిల్లా కలెక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, నంద్యాల తాలూకా అసోసియేషన్ అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి హుసేన్‌రెడ్డి, నాగరాజు, శేఖర్, నారపురెడ్డి పాల్గొన్నారు.

పొదుపు.. జీవితానికి మలుపు

చిన్న మొత్తాలు పొదుపుతో రాబోయే కాలంలో జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతాయని నంద్యాల పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణరావు తెలిపారు. పోస్టల్ శాఖ ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన పథకాలపై బుధవారం నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోస్టుమాస్టర్ అలీషా, ఎంఈఓసీ నరసింహ, రామశేషిరెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

- గుండంపాడులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణం పూర్తి
- రూ. 90 లక్షలతో 16 సిమెంట్ రోడ్ల ఏర్పాటు
- బోయలకుంట్లలో రూ.44 లక్షలతో గోదాము
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



గుంప్రమాన్‌దిన్నెలో వేసిన సీసీ రోడ్డు



గుండంపాడులో తుది మెరుగులు దిద్దుకున్న గ్రామ సచివాలయ భవనం



బోయలకుంట్లలో పనులు పూర్తయిన గోదాము

శిరివెళ్ల: మండలంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం, పంచాయతీ నిధులతో పనులు చేపట్టారు. నాలుగు గ్రామ పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తిచేసుకున్న వాటిని ఈ నెల 15వ తేదీన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- గుండంపాడులో రూ.42 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ. 21లక్షలతో రైతు భరోసా కేంద్రం పనులు పూర్తయ్యాయి.
- బోయలకుంట్లలో రూ. 44 లక్షలతో నిర్మించిన వ్యవసాయగోదాము, రూ.25 లక్షలతో 6 సిమెంట్ రోడ్లు,
- గుంప్రమాన్‌దిన్నెలో రూ. 20 లక్షలతో 3 సిమెంట్‌రోడ్లు.రాజనగరంలో రూ.4లక్షలతో మెటల్ రోడ్డు
- వనికినిదిన్నెలో రూ. 15 లక్షలతో 2 సిమెంట్ రోడ్లను ప్రారంభించనున్నారు.

తహసీల్దార్‌గా కులశేఖర్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: నూతన తహసీల్దార్‌గా కులశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ మొయిద్దీన్ చిత్తూరుకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. నూతన తహసీల్దార్ చిత్తూరు నుంచి బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

రుద్రవరం:రోడ్డు నిభందనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు.ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, లైసెన్స్‌లు లేకపోవడం,చిన్నపిల్లలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడి కుటుంబాలు చిన్నా భిన్నం అవుతున్నాయని, అలాంటివి జరక్కుండా ఉండేందుకు వాహన తనిఖీలు చేపట్టామన్నారు.నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే శిల్పా రవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

నంద్యాల: పట్టణంలోని 10వ వార్డుకు చెందిన జాఫర్, ఇలియాస్, ఫైరోజ్, సలీం, అప్రోజ్, మన్సూర్, ఫరూక్, కరీముల్లా, జమాల్, మాబాషా, అక్బర్, జాఫర్, కాజా, ఇర్ఫాన్, సైపుల్లా, బాషా, అబిబ్, ఇమ్రాన్‌తో పాటు మరో 150 మంది యువకులు కౌన్సిలర్ మజీద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ల వెంకటస్వామి, ఫుట్బాల్ నగర్ ఖాద్రీ ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత వైఎస్సార్‌సీపీకి వెన్నుముఖ లాంటివారని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి యువకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన

గోస్పాడు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పసురపాడు-ఎస్.నాగుల వరం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు, గోస్పాడులోని స్త్రీశక్తి భవనం, సచివాలయం, ఉపాధి హామీ కార్యాలయాలను బుధవారం ప్రారంభించారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, పీపీ నాగిరెడ్డి, ప్రహ్లాదరెడ్డి

రూ.6.22 కోట్లతో అభివృద్ధి పనులు..

మండలంలోని గోస్పాడు, చింతకుంట్ల, జూలేపల్లె, నెహ్రూనగర్, తేళ్లపురి గ్రామాల్లోని రైతులకు అందుబాటులో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు రూ.5.40 కోట్లతో నిర్మించారు. అలాగే గోస్పాడులో రూ.35 లక్షలతో సచివాలయ భవనం, రూ.47 లక్షలతో స్త్రీశక్తి భవనం, ఉపాధి హామీ కార్యాలయాల పనులు పూర్తవడంతో వీటన్నింటినీ ప్రారంభించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ ముక్కమల్ల ప్రహ్లాదరెడ్డి, శశికళారెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, వైస్ ఎంపీపీ రాజు, సర్పంచ్‌లు శివరామిరెడ్డి, రాజారెడ్డి, ప్రమీల, నాయకులు యాసం రామసుబ్బారెడ్డి, నాగమోహన్‌రెడ్డి, అమీదాల నారాయణ, బెక్కెం నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ భక్తవత్సలరెడ్డి, గడ్డం ప్రసాద యాదవ్ పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

చాగలమర్రి: పెద్దబోదనం గ్రామ సమీపంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద 40వ నంబరు జాతీయ రహదారిపై అదుపు తప్పి కారు బోల్తా పడి ఇరువురు మహిళలకు గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు పట్టణానికి చెందిన శరత్‌చంద్ర టీఎస్08జీఎక్స్5249 నంబరు గల కారులో బుధవారం ఉదయం తల్లి గంగమ్మ, వదిన తేజస్వినితో కలిసి కడప పట్టణంలోనున్న బంధువుల ఇంటికి బయలు దేరారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడగా, గంగమ్మ, తేజస్వినికి గాయాలయ్యాయి. వారిని టోల్ ప్లాజా సిబ్బంది కడపకు తరలించారు.

హైవే భూములకు పరిహారం చెల్లించండి

నంద్యాల: జాతీయ రహదారులు 340-సి, 340-బి, 167-కె లకు సంబంధించి భూ సేకరణ జరిగి విచారణ పూర్తయిన వాటికి పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో జాతీయ రహదారుల భూసేకరణ, పరిహార చెల్లింపు అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 340-సి (కర్నూలు - దోర్నాల) నిర్మాణానికి జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు మండలాల్లో 220.6819 హెక్టార్ల భూసేకరణ పూర్తయ్యిందని, సంబంధిత రైతులకు పరిహారం చెల్లించామని, ఇంకా మిగిలిపోయిన రైతులకు చెల్లింపుకు సంబంధించి విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎన్‌హెచ్ 167- కె (నంద్యాల - జమ్మలమడుగు) నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోయిలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల్లో 187.9493 హెక్టార్లకు అవార్డు ఎంక్వయిరీ పూర్తయ్యిందని, ఇంకా రావలసిన రిపోర్టులు త్వరగా తెప్పించుకొని అవార్డులు పాస్ చేయాలని హైవే కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే (కల్వకుర్తి - నంద్యాల)కొత్తపల్లె, ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, నంద్యాల మండలాల మీదుగా వెళ్లే హైవేకు 251.03 హెక్టార్ల భూసేకరణ పూర్తయి పెండింగ్‌లో ఉన్న పరిహారానికి సంబంధించి విచారణ వేగంగా పూర్తిచేయాలన్నారు. జాతీయ రహదారి 340-బి (సోమయాజులపల్లె - డోన్) బేతంచెర్ల, డోన్ మండలాల్లో 54.08 హెక్టార్ల భూసేకరణ పూర్తయి పెండింగ్‌లో ఉన్న పరిహారానికి సంబంధించి విచారణ పూర్తిచేయాలని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కె. శ్రీనివాసులు

అర్హులందరికీ 'ఉపాధి' కల్పించండి

నంద్యాల (సెంట్రల్): జిల్లావ్యాప్తంగా అర్హులందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఉపాధి హామీ జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ బుధవారం జిల్లా సర్వోన్నతాధికారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం స్థితిగతులను కలెక్టర్‌కు వివరించారు.

రైలు కింద పడి ఇద్దరి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

నంద్యాల టౌన్: నంద్యాల- నందిపల్లె రైల్వేస్టేషన్ల మధ్య, పొన్నాపురం రైల్వే గేట్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతుడు తెల్లని రెడీమేడ్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. నంద్యాల రైల్వే స్టేషన్ మాస్టర్ తెలిపిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు సెల్ 9440627653, 9490081633 నంబర్లకు తెలియజేయలని కోరారు. అలాగే.. నంద్యాల రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతూ కాలు జారి కిందపడి నునెపల్లెకు చెందిన రవి కుమార్ బుధవారం మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపారు.

వ్యక్తిపై దాడి

దొర్నిపాడు: క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనరసయ్య పాత కక్షలు మనస్సులో పెట్టుకొని నాగరాజుపై కర్రతో దాడి చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.






సంజీవనగర్ రామాలయం, బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయం , మాయలూరులో సరస్వతీ మాత శ్రీ సంకల్ప్ పాఠశాలలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న ముస్లింలు

వైభవంగా వసంత పంచమి

నంద్యాల(వ్యవసాయం): మాఘ శుద్ధ పంచమి, చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక ప్రథమనంది దేవస్థానంలోని గాయత్రి దేవాలయంలో బుధవారం బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అ మ్మవారికి పంచామృతాభిషేకాలు, హోమాలు చేప ట్టి, అమ్మవారిని పెన్నులతో అలంకరించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అమ్మవారి కంకణాలు, పెన్నులు అందజేశారు.

సంజీవనగర్ రామాలయంలో..

సంజీవనగర్ రామాలయంలోని శ్రీకోదండ రామాలయంలో వెలసిన సరస్వతీదేవికి బుధవారం శ్రీ భగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో వసంత పంచమిని పురస్కరించుకొని 108 కలశాలతో క్షీరాభిషేకం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం సరస్వతి హోమం చేపట్టి, మహిళలకు కోలాట సామగ్రిని అందజేశారు. సాయంత్రం సామూహిక ఉచిత లక్ష కుంకుమార్చన జరిపించారు. కోటావీధిలోని బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానంలో శ్రీసరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులకు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, మౌలాలిరెడ్డిలు అక్షరభ్యాసం చేయించారు. సంకల్ప్ పాఠశాలలో చైర్మన్ సుధాకర్, సతీమణి రమ్యా రెడ్డి అక్షరాభ్యాసం చేయించారు.రామకృష్ణ డిగ్రీ కళాశాలలో హయగ్రీవాచారి, కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ఎస్టేట్ మేనేజర్ ప్రగతి రెడ్డిల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బాలా అకాడమీ పాఠశాలలో ప్రిన్సిపాల్ మాధవీలత, డైరెక్టర్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

సరస్వతీ దేవీ విగ్రహ ఏర్పాటు

శిరివెళ్ల: కోటపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం సరస్వతీ దేవీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. యాళ్లూరుకు చెందిన నటరాజశర్మ శాస్త్రోక్తంగా పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, విగ్రహ దాత మేర్వ మధుసూదన్‌రెడ్డి, సర్పంచు దూదేకుల ఉశేన్‌బీ, వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, మాజీ సర్పంచు కల్లూరి శకుంతలమ్మ, ఎంఈఓ నాగార్జునరెడ్డి, హెచ్‌ఎం గోపాల్, రఘురామిరెడ్డి, బూసిరెడ్డి పూజలు చేశారు.



చాగలమర్రిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : వసంత పంచమి వేడుకల్లో భాగంగా మండలంలోని మాయలూరు, ఉయ్యాలవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. చదువుల తల్లికి కుంకుమార్చన, మహా మంగళహారతి, పుష్పార్చన, అభిషేకాలు నిర్వహించారు.

చాగలమర్రి: స్థానిక భారతీ విద్యామందిరంలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ వీరభద్రుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పండితుల మంత్రోచ్చారణలతో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. చివరగా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.




ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన బుడగ జంగాల కుటుంబాలు, పసులపేట, నూరాన్‌పేటకు చెందిన యువకులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన టీడీపీ కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. శిరివెళ్ల మెట్ట వద్దనున్న బుడగ జంగాల నాయకులు మోత్కూరు వెంకటయ్య, పుల్లయ్య, చిన్న, వెంకటేశ్వర్లు, పెద్దన్న, సుంకయ్య, రామయ్య, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో 65 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. అలాగే పసులపేటకు చెందిన పసుల రవి, నూరాన్‌పేటకు చెందిన ఉశేని, షౌకత్, మాబాషా, షేర్, అబ్దుల్ ఖాదర్, వసీం, హైదరాలి, నూర్‌బాషా, మాబాషా, ఖాజా ఉశేని, ఫీర్‌బాషాతో పాటు 120 మైనారిటీ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు.

'సిద్ధం'లో ఆళ్లగడ్డ సత్తా చాటుదాం

ఈ నెల 18వ తేదీన అనంతపురంలో జరగనున్న సిద్ధం సభలో ఆళ్లగడ్డ సత్తా చాటుదామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక షాదిఖానాలో సిద్ధం సభపై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి కూడ భారీ సంఖ్యలో హాజరవుదామని పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, గ్రామ స్థాయి నుంచి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, మండల ఉపాధ్యక్షుడు చీమల అనూష, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరహరి, ముల్లా అన్వర్‌భాషా, దొర్నిపాటి రఫీ, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, మండలంలోని సర్పంచులు పాల్గొన్నారు.



తిక్కస్వామి సమాధి

మతసామరస్యానికి ప్రతీక తిక్కస్వామి ఉరుసు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో సాయిబాబానగర్‌లో వెలసిన శ్రీహజరత్ సయ్యద్‌షా షహన్‌షా అవులియా చిస్తివుల్ ఖాదరి ఖుద్దహు(తిక్కస్వామి) ఉరుసు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయని దర్గా ధర్మకర్త షేక్‌అల్లాబకాష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో మతసామరస్యానికి ప్రతీకగా జరిగే ఉరుసుకు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి కులమతాలకు అతీతంగా వేలాదిమంది భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. షహన్‌షా వలి అనే పీకీర్‌బాబా(తిక్కస్వామి)గా అవతరించి 1945లో పరమపదించిన స్థలం వద్దనే దర్గా నిర్మించారని చెప్పారు. ఆయన మహిమలను గుర్తు చేసుకుంటూ 1945 నుంచి ప్రతి ఏడాది ఉరుసు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 15వ తేదీన గంధం, 16న ఉరుసు, 17, 18, 19 తేదీల్లో జార్తలు ఉంటాయని వివరించారు. 16వ తేదీ రాత్రి ఖవ్వాలి ఉంటుందని, 18న ఆదివారం ఉదయం ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశామన్నారు.

మోడల్ పరీక్షతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం కోసమే మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాయుడు, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంయుడు పేర్కొన్నారు. బుధశారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి మోడల్ పరీక్షను నిర్వహించారు. శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, మేఘన కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జయసింహారెడ్డి పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 16వ తేదీన తలపెట్టిన ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు లక్ష్మణ్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లను జైళ్లకు పంపే హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.